సాక్షి ములుగు

శనివారం | 9 | నవంబర్ | 2024



టెక్నోజియాన్-24 షురూ..

వరంగల్ నిట్ ఆడిటోరియంలో శుక్రవారం టెక్నోజియాన్-24 వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది 50కిపైగా ఈవెంట్స్‌తో విద్యార్థులు సందడి చేయనున్నారు. - 8లో▸



ఇక తెలుగులోనే..

విద్యుత్ వినియోగదారులు, రైతులకు విద్యుత్ సమాచారం సులభంగా అర్థమయ్యే రీతిలో తెలుగులోనే అందించనున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ నిర్ణయించింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0^0 / 19.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములుగు రూరల్: విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11 కేవీ ఉప కేంద్రాల మరమ్మతు కారణంగా నేడు (శనివారం) ఉదయం 9 నుంచి 10 గంటల వరకు పస్రా, గోవిందరావుపేట, మల్లంపల్లి, రాంచంద్రాపూర్, వెల్తుర్లపల్లి, తాడ్వాయి, కన్నాయిగూడెం, రామన్నగూడెం, కమలాపురం, మంగపేట, మల్లూరు, వాజేడు, వెంకటాపురం(కె) కేంద్రాల్లో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



వాజేడు: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు పాఠశాల యాజమాన్యం శుక్రవారం అభినందించారు. మండల పరిధిలోని పెద్ద గొళ్ల గూడెం ఆశ్రమ పాఠశాలలో పది, తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థినులు మొడెం వైష్ణవి, కాక రూప కళ ఊట్నూరు ఐటీడీఏలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థినులు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు కేశవరావు, రోజా రాణి, తిరుపతమ్మ, బుచ్చిబాబు, కృష్ణయ్య, రామారావు, సతీష్ కుమార్, కవిత, బుచ్చయ్య, భారతి, ఉమాదేవి, గౌతమి తదితరులు ఉన్నారు.

తగ్గిన ఆర్టీసీ బస్సుల అద్దె ధరలు

ములుగు రూరల్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వివాహ శుభకార్యాలకు ఆర్టీసీ బస్సులు అద్దెకు తీసుకునే వారికి అద్దె రుసుము తగ్గించిందని వరంగల్-2 డిపో మేనేజర్ జ్యోత్స్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీర్థయాత్రలకు, దైవ దర్శనాలకు బస్సులను అద్దెకు తీసుకునే వారికి సంస్థ 15 నుంచి 20 శాతం తగ్గించిదన్నారు. కిలోమీటర్ ప్రకారం పల్లె వెలుగు బస్సుల అద్దె రూ.68 నుంచి రూ.52, ఎక్స్‌ప్రెస్ ధర రూ. 69 నుంచి 62, డీలక్స్ రూ. 65 నుంచి రూ. 57, సూపర్ లగ్జరీ రూ. 65 నుంచి రూ. 59లకు తగ్గించిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్టీసీ బస్సు బుకింగ్ కోసం అసిస్టెంట్ మేనేజర్ 8500372694, 9059662555, 9849118696, 9959558556 నంబర్లను సంప్రదించాలన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ములుగు రూరల్: రైతులు పండించిన పత్తి పంటను సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ గఫూర్ పాషా అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పత్తి మిల్లును సందర్శించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు అవసరాల నిమిత్తం ప్రైవేట్ వ్యాపారులకు పత్తి అమ్ముకుంటూ నష్టపోతున్నారన్నారు. సీసీఐ కేంద్రాల్లో తేమ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయకూడదని, సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌రెడ్డి, దేవేందర్, రమేష్, ప్రవీణ్, అరవింద్, సంపత్, రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

హార్వెస్టర్ డ్రైవర్లకు అవగాహన



వెంకటాపురం(ఎం): నాణ్యమైన ధాన్యాన్ని తీసేలా వరికోత యంత్రాల ఓనర్లు, డ్రైవర్లు కృషి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి తేజావతి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వరికోత యంత్రాల ఓనర్లు, డ్రైవర్లకు వరికోసే విధానంపై పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడారు. వరిపంట పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాత కోస్తే తాలు ఉండదని, కోత మిషన్ ఉపయోగించే సమయంలో బ్లోయర్ ఆన్‌లో ఉండాలన్నారు. వరి పంటలో తాలు, మట్టి రాకుండా యంత్రాలను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, మండల వ్యవసాయ అధికారిణి శైలజ, ఏఈఓలు సాయికుమార్, శ్రీనివాస్, సునీల్, స్వామి పాల్గొన్నారు.

‘యాసంగి’కి రెడీ

జిల్లాలో 55,000 ఎకరాల్లో వరి, 5,587 ఎకరాల్లో మొక్కజొన్న సాగు అంచనా

- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- ప్రభుత్వానికి నివేదిక అందించిన వ్యవసాయ శాఖ



ములుగు: జిల్లాలో యాసంగి సీజన్ యాక్షన్ ప్రణాళికను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేశారు. రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించి ఏఏ పంటలు ఎన్ని ఎకరాల్లో సాగు అవుతుందనే విషయంపై జిల్లా వ్యవసాయ అధికారి తేజోవతి యాసంగి యాక్షన్ ప్లాన్ రెడీ చేసి నివేదికను ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో భూగర్భ జలాలు పుష్కలంగా ఉండడంతో బోరుబావుల, చెరువు శిఖం కింద వరి సాగు చేయడానికి పొలాలను చదునుచేయడం, నీళ్లు కట్టడం, నారు మడులను సిద్ధం చేయడం తదితర పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఓ వైపు వానాకాలం వరి కోతల్లో రైతులు బిజీగా ఉన్నప్పటికీ మరోవైపు యాసంగి నారు మడులను సిద్ధం చేస్తున్నారు. డిసెంబర్ మొదటి వారంలో జిల్లా వ్యాప్తంగా యాసంగి పనులు ఊపందుకోనున్నాయి.

జిల్లా 62,350 ఎకరాల్లో సాగు అంచనా

జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మండలాల్లో యాసంగిలో 62,350 ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగు కానున్నాయి. జిల్లాలోని రామప్ప, లక్నవరం, మల్లూరు, పాలెం, గుండ్లవాగు వంటి పెద్ద చెరువులతో పాటు స్థానికంగా ఉన్న చెరువుల్లోని నీటి లభ్యత ఆధారంగా ఈ ఏడాది 55వేల ఎకరాల్లో వరి సాగు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ భావిస్తుంది. ఇప్పటికే రామచంద్రాపురం, కోడిశలకుంట, పందికుంట, దేవనగర్, నిమ్మనగర్ వంటి గ్రామాల్లో రైతులు యాసంగి పనులు చేస్తున్నారు. దీంతో పాటు బోరుబావుల కింద, సొంత నీటి కుంటలు ఉన్న రైతులు మొక్కజొన్న వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో 5,587 ఎకరాల్లో మొక్కజొన్న సాగయ్యే అవకాశం ఉంది. అబ్బాపురం, జాకారం, మల్లంపల్లి, మహ్మద్‌గౌస్‌పల్లి, శ్రీరాములు పల్లి, బాణాలపల్లి వంటి ప్రాంతాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. వరికి 1,370 క్వింటాళ్లు, పెసరకు 36 క్వింటాళ్లు, మొక్కజొన్నకు 448 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉంది. సాగుకు 9161.63 క్వింటాళ్ల యూరియా అవసరం ఉండగా వ్యవసాయ శాఖ వద్ద 4,124 క్వింటాళ్లు, డీఏపీ 3117.5కి గాను 781 క్వింటాళ్లు, కాంప్లెక్స్ ఎరువులు 3117.5కి గాను 3,351 క్వింటాళ్లు, పొటాష్ 1558.5 క్వింటాళ్లకు గాను 282 క్వింటాళ్లు అందుబాటులో ఉంది. యాసంగి సీజన్‌కు కావాల్సిన విత్తనాలు, ఎరువులు డిమాండ్‌కు అనుగుణంగా తెప్పిస్తామని వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు.

జిల్లాలో అందుబాటులో ఉన్న విత్తనాలు

పంట	2023-24	2024-25	విత్తనాలు (క్వింటాళ్లలో)	అందుబాటులో ఉన్నవి
వరి	50,479	55,000	13,750	2,750
పెసర	432	450	36	36
కందులు	184	200	16	16
వేరుశనగ	735	800	720	00
మొక్కజొన్న	5,587	5,600	448	00
ఇతర పంటలు	272	300	24	00
మొత్తం	57,679	62,350	14,994	2,755.2

ఎరువుల వివరాలు

ఫర్టిలైజర్	అవసరం అయినవి	అందుబాటులో ఉన్నవి (మెట్రిక్ టన్నుల్లో)
యూరియా	9,161.63	4,124
డీఏపీ	3117.5	781
కాంప్లెక్స్	3,117.5	3,351
పొటాష్	1,558.5	282

ప్రభుత్వానికి నివేదిక అందించాం..

యాసంగిలో సాగయ్యే పంటల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదికను అందించాం. ప్రస్తుతానికి డిసెంబర్ వరకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. మిగతావి డిమాండ్ మేరకు అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఈ సారి జిల్లా వ్యాప్తంగా 55వేల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉంది. బోరుబావుల కింద ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగు చేయడానికి ముందుకు వస్తున్నారు.

- తేజోవతి, జిల్లా వ్యవసాయ అధికారి

సర్వేలో తప్పులు ఉండొద్దు

- ఎన్యుమరేటర్లు జాగ్రత్తలు తీసుకోవాలి
- కలెక్టర్ దివాకర

ములుగు: సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యుమరేటర్లు వివరాలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ దివాకర ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం సర్వేపై జిల్లా నోడల్ అధికారి, మండల ప్రత్యేక అధికారులు, డీఈఓ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సూపర్‌వైజర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు సమగ్ర కుటుంబ సర్వే ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇప్పటికే సర్వే సిబ్బందికి స్టేషనరీ పంపిణీ చేసినట్లు తెలిపారు. నేటి (శనివారం) నుంచి సర్వే ఉంటుందని, సిబ్బంది ఉదయం 8 గంటలకు గ్రామాల్లో ఉండాలన్నారు. సిబ్బందికి ఎలాంటి మినహాయింపు లేదని నూరుశాతం విధులకు హాజరుకావాలన్నారు. కేవలం ప్రభుత్వం అందించిన ఫారాల్లో మాత్రమే వివరాలు నమోదు చేయాలని ఎలాంటి డూప్లికేట్ ఫారాలకు అనుమతి లేదన్నారు. ప్రతి రోజు 20 ఇళ్లు సర్వే చేయాలని, ఎన్యుమరేషన్ బ్లాక్‌లో 175 కంటే ఎక్కువ గృహాలు ఉంటే బై నంబర్లు ఇవ్వాలని సూచించారు.

గెలుపోటములు సహజం

గోవిందరావుపేట: క్రీడల్లో గెలుపోటములు సహజమని కలెక్టర్ దివాకర అన్నారు. మండలంలోని చల్వాయి ఐదవ బెటాలియన్‌లో నిర్వహించిన ఇంటర్‌కాయ్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు జీవనశైలిలో ప్రధాన భాగమన్నారు. శారీరక ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, మానసిక శక్తికి, ధైర్యం, క్రమ శిక్షణను పెంచే ప్రధాన సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. నిజమైన గెలుపు అనేది శ్రమ, పట్టుదల, పోరాటస్ఫూర్తిలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ అలెక్స్, అడిషనల్ కమాండెంట్ పెదబాబు, అసిస్టెంట్ కమాండెంట్లు అనిల్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు శంకర్, కార్తీక్, శ్రీనివాసులు, శ్రీనివాసాచారి, రాంప్రసాద్, అన్నమయ్య తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న కలెక్టర్ దివాకర

మావోయిస్టుల కదలికలపై మరింత నిఘా

- ఎస్పీ డాక్టర్ శబరీష్

వాజేడు: మావోయిస్టుల కదలికలపై మరింత నిఘాను పెంచాలని, గంజాయి రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టాలని ఎస్పీ డాక్టర్ శబరీష్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం వాజేడు మండల పరిధిలోని పేరూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ రిసెప్షన్‌లోని రికార్డులను పరిశీలించి కేసుల స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్, ఆయుధ సామగ్రి, సిబ్బంది నైపుణ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలు ఛత్తీస్‌గఢ్‌తో అంతర్రాష్ట్ర సరిహద్దును కలిగి ఉన్నందున మావోయిస్టుల కదలికలపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నందున ప్రజల భద్రతకై పటిష్టమైన చర్యలను తీసుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధిత వ్యక్తుల నుంచి ఫిర్యాదు అందగానే విచారణ చేపట్టాలని, ఎఫ్ఐఆర్ నమోదు, కేసుల దర్యాప్తు నిష్పక్ష పాతంగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట డీఎస్పీడీసీఆర్ రాములు, వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

టీజీఓ జిల్లా అసోసియేషన్ ఎన్నిక

ములుగు: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ జిల్లా అసోసియేషన్‌ను శుక్రవారం ఎలక్షన్ ఆఫీసర్ కోలా రాజేష్‌కుమార్ (ఏఓ, డీఎంహెచ్ఓ, హన్మకొండ), సంతోష్‌ల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సంపత్‌రావు (జెడ్పీ సీఈఓ), అసోసియేట్ అధ్యక్షుడిగా రామకృష్ణ (ఎంపీడీఓ, ములుగు), ఉపాధ్యక్షులుగా డాక్టర్ కొంరయ్య (డీవీహెచ్ఓ), శ్రీనివాస్ (ఎంవీఐ), శరీష (డీడబ్ల్యూఓ), సెక్రటరీగా జీవన్‌కుమార్ (ఆర్‌అండ్‌బీ, డీఏఓ), జాయింట్ సెక్రటరీలుగా విజయభాస్కర్ (తహసీల్దార్, ములుగు), జితేందర్‌రెడ్డి (ఎంపీఓ, గోవిందరావుపేట), శైలజ(ఎంఏఓ, వెంకటాపూర్), ట్రెజరర్‌గా ప్రకాష్‌రెడ్డి (ఎస్టీఓ), ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీకాంత్, పబ్లిక్ సెక్రటరీగా డీపీఆర్ఓ రఫీక్, ఆఫీస్ సెక్రటరీగా ఎంపీఓ రహీం, కల్చరర్ సెక్రటరీగా రాజ్‌కుమార్ (జేఎల్, ఎస్ఎస్ తాడ్వాయి), స్పోర్ట్స్ సెక్రటరీగా రంజిత్ (ఏఈఈ, ఇరిగేషన్), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా దేవేందర్‌రావు, రాజు, మాధవీశీతల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారుల సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అసోషియేషన్ సభ్యులు కలెక్టర్ దివాకరకు పూలమొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, రాష్ట్ర నాయకులు ఉపేందర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, రామారావు, మురళీధర్‌రెడ్డి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పూలమొక్క అందిస్తున్న సంపత్‌రావు

‘టాస్క్’తో ఉద్యోగ అవకాశాలు

ములుగు: తెలంగాణ అకాడమీ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ (టీఏఎస్‌కే)తో విద్యార్థులు ఉపాధి ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం అన్నారు. ఈ మేరకు శుక్రవారం టాస్క్ కళాశాల కన్వీనర్ కవిత ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ టాస్క్ ప్రోగ్రాంతో విద్యార్థులకు నైపుణ్యం, కమ్యునికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ మెళకువలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. టాస్క్ కళాశాల కన్వీనర్ కవిత మాట్లాడుతూ చాలా మందికి ఉద్యోగాలు కల్పిస్తున్న ఘనత టాస్క్‌కు దక్కుతుందన్నారు. వరంగల్ జిల్లా టాస్క్ మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి రూ.354, బీసీ, ఓసీ విద్యార్థులు రూ. 708 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే మూడు సంవత్సరాల పాటు 40 రకాల శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. టాస్క్‌కు 100 కంపెనీలతో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) ఉందన్నారు. ఈ సమావేశంలో అధ్యాపకులు భాస్కర్, సోమన్న, నాగమణి, సరిత, శిరీష, రాధిక, అనిల్‌కుమార్, ఉదయశ్రీ, విజేత, శంకర్, జగదీశ్, తేజోలత, శ్రీను, మౌలానా, అనిత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మల్లేశం

పోడు చేస్తున్న వ్యక్తులపై కేసు

మంగపేట: మండలంలోని పూరేడుపల్లి అటవీ ప్రాంతంలో పోడు భూమి కోసం అక్రమంగా చెట్లను నరుకుతున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు అటవీశాఖ మంగపేట ఇన్‌చార్జ్ రేంజ్ అధికారి మంగళపెల్లి అశోక్ తెలిపారు. శుక్రవారం మంగపేట రేంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పూరేడుపల్లి బీటు పరిధిలోని కంపార్టుమెంటు నంబర్ 48, మల్లూరు సెక్షన్‌లో పూరేడుపల్లి గ్రామానికి చెందిన మల్కెం నర్సింహారావు, కొప్పుల సాంబయ్య, పోలం సమ్మయ్య, ఎట్టి ఆదినారాయణ, ముప్పిడి కృష్ణ అనే ఐదుగురు వ్యక్తులు రిజర్వు అటవీ ప్రాంతంలో అక్రమంగా చెట్లు నరికి పోడు చేస్తున్న క్రమంలో వారిని పట్టుకున్నామన్నారు. అటవీ చట్టం మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన వెల్లడించారు. రిజర్వు అటవీ పరిధిలో ఎవరు కూడా పోడుచేసేందుకు ప్రయత్నించి జైలుపాలు కావొద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలో మల్లూరు సెక్షన్ ఆఫీసర్ ఎండీ రషీద్, బీట్ ఆఫీసర్ దివ్య, పూరేడుపల్లి నార్త్ బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.



అరెస్ట్ చూపుతున్న అటవీశాఖ అధికారులు

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు
- జిల్లాలోని పలు ఆస్పత్రుల తనిఖీ

ఏటూరునాగారం: సామాజిక ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గోపాల్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిని జిల్లా మాత శిశు సంరక్షణ, పోషకాహార ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీకాంత్, డాక్టర్ ప్రసాద్‌లతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సామాజిక వైద్యశాలలోని ఐసీటీసీ, హెచ్ఐవీ కౌన్సిలింగ్ సెంటర్, న్యూట్రిషన్ సెంటర్‌ను పరిశీలించారు. రిహాబిలిటేషన్ సెంటర్, నవజాతి శిశువు కేర్ యూనిట్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గౌతం, వైద్యులు అనిల్, డెమో సంపత్ పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెరగాలి

మంగపేట: మండల కేంద్రంలోని రౌండ్ క్లాక్ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలని జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు పీహెచ్‌సీ వైద్యాధికారి గౌతమ్, సిబ్బందిని ఆదేశించారు. మంగపేట పీహెచ్‌సీని జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని డెలివరీ రూమ్, డ్రగ్ స్టోర్‌రూమ్, రోగుల వార్డును పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మొదటి సారిగా పీహెచ్‌సీకి వచ్చిన జిల్లా వైద్యాధికారిని పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది శాలువతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాతాశిశు సంరక్షణ, పోషకాహార జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసాద్, వైద్యాధికారి తరుణ్, మనోజ్‌కుమార్, పద్మ, డెమో సంపత్, సీహెచ్ఓ శారద, ఎంపీహెచ్ఈఓ అబ్బాస్, మౌనిక, ఇంద్రావతి, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: అందుబాటులో ఉండి రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని డీఎంహెచ్ఓ గోపాల్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన సందర్శించి రోగుల ఓపి, సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రభుత్వవైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్య సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాత శిశు సంక్షేమ, పోషకార జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్, వైద్యాధికారులు చిరంజీవి, మౌనిక, డీపీఎంఓ సంజీవరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మంగపేట: రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ గోపాల్‌రావు



ఏటూరునాగారం: రక్తనిధి కేంద్రం వద్ద యూనిట్ల వివరాలను తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

వెంకటాపురం(ఎం): జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని రామాంజాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన కె.శ్రావణి, ఎం.సాహితి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గోదదేవి తెలిపారు. ఈనెల 5, 6, 7 తేదీల్లో ఉట్నూరు ఐటీడీఏలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడల్లో విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచినందుకు గాను జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల డిప్యూటీ వార్డెన్ తిరుమల్ సింగ్, ఉపాధ్యాయులు ధరంసింగ్, దశరథ్‌లు అభినందించారు.

‘దర్యాప్తు కొనసాగిస్తున్నాం’

వెంకటాపురం(ఎం): రామప్ప ఉప ఆలయాల్లో ఒకటైన గొల్లాల గుడి పైకప్పును ధ్వంసం చేసిన కేసులో సమగ్ర దర్యాప్తు కొనసాగుతుందని ములుగు డీఎస్పీ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 22న గుప్తనిధుల కోసం దుండగులు గొల్లాల గుడి పైకప్పును ధ్వంసం చేశారని పురావస్తుశాఖ మల్టీ టాస్కింగ్ స్టాఫ్ కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితులను గుర్తించామన్నారు. నేరానికి పాల్పడిన భూపాలపల్లి జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన జాగిరి నరేష్, పులి గౌతమ్, నలుబోతుల ఎర్రయ్య, గుర్రంపేట గ్రామానికి చెందిన రాయబారు ఆగయ్యలను ఈనెల 6న అరెస్ట్ చేసి ములుగు కోర్టులో హాజరు పరిచామన్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు.

అంగన్‌వాడీ బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి

ఏటూరునాగారం: స్త్రీ శిశు సంక్షేమ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ల బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని, స్థానిక మహిళలకే అంగన్‌వాడీ టీచర్లుగా అవకాశం కల్పించాలని తెలంగాణ మాల మహానాడు, ఎమ్మార్పీఎస్ నాయకులు నెగరికంటి సురేష్, మాదరి మధు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మానసపల్లి అంగన్‌వాడీ కేంద్రం -1 సెంటర్‌లో పప్కాపురం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ ఇక్కడికి రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మానసపల్లిలోని అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీ పదవీ విరమణ పొందడంతో అక్కడ ఖాళీ ఏర్పడిందన్నారు. దీంతో పప్కాపురంలోని టీచర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. అంగన్‌వాడీ పోస్టులు ఎక్కడ ఖాళీగా ఉన్న కేవలం స్థానిక అర్హులైన గ్రామస్తులకు మాత్రమే ఉద్యోగం ఇవ్వాలని, సెంటర్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు, బాలింతలు, గర్భిణులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. నిబంధనలను ఉల్లంగించి బదిలీ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, ఎలుగు శ్రీకాంత్, గంపల రవి, ఎల్లయ్య, గొట్టే రవి, లాలయ్య, ఎర్ర ముత్తయ్య, ప్రశాంత్, రాజు, కృష్ణ, సారయ్య, గద్దల రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు సురేష్

ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలి

మంగపేట: ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి లోటు పాట్లు జరుగకుండా ప్రభుత్వం నిబంధనలకు లోబడి కొనుగోలు చేయాలని ఐకేపీ (సెర్ప్) డీపీఎం గోవింద్ చౌహాన్ అన్నారు. మండలంలోని నర్సింహాసాగర్, కమలాపురంలో సెర్ప్ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి, శ్రీ విఘ్నేశ్వ గ్రామైఖ్య సంఘాల సభ్యులకు కేటాయించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీపీఎం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అప్పారావు, సీసీ శ్రీను, తార, కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం చౌహాన్

క్లుప్తంగా

కేయూ ఐక్యూఏసీ డైరెక్టర్‌గా షమిత


షమితకు ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్(ఐక్యూఏసీ) డైరెక్టర్‌గా జువాలజీ విభాగం ఆచార్యులు షమిత నియమితులయ్యారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు ఆ సెల్ డైరెక్టర్‌గా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆచార్యులు నర్సింహారావు బాధ్యతలను నిర్వర్తిస్తుండగా ఆయన స్థానంలో షమితను నియమించారు. ప్రస్తుతం జువాలజీ విభాగం అధిపతిగా, కేయూ లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న షమిత జువాలజీ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, కేయూ అకాడమిక్ ఆడిట్ డీన్‌గానూ వ్యవహరించారు. కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం షమితకు నియామక ఉత్తర్వులు అందజేశారు. షమిత.. ఆచార్యులు నర్సింహాచారి నుంచి బాధ్యతలను స్వీకరించారు.

బైక్‌ను ఢీ కొన్న బొలెరో..

- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు


గుర్రం సంజయ్ (ఫైల్)


తీవ్రంగా గాయపడిన కప్పల బన్ని

గూడూరు: బొలెరో వాహనం బైక్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని మానుకోట వైపు జాతీయరహదారిలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గురువారం రాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన గుర్రం సంజయ్(18), మట్టెవాడకు చెందిన కప్పల బన్ని ఇద్దరు స్నేహితులు డిగ్రీ చదువుతున్నారు. రాత్రి 10 గంటల తర్వాత గూడూరులో కల్సుకున్న ఇద్దరు మిత్రులు ఒకే బైక్‌పై తమ గ్రామాలకు బయలుదేరి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపానికి చేరుకున్నారు. అదే సమయంలో ఎదురుగా మానుకోట నుంచి ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసి దూసుకొచ్చిన బొలెరో వాహనం యువకులు ప్రయాణిస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో గుర్రం సంజయ్ తల, ఛాతి, ఇతర ప్రదేశాల్లో తీవ్రగాయాలై రక్తస్రావంలో పడిపోగా, కప్పల బన్నికి ఎడమ చేయి రెండు చోట్ల విరిగి, తలకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు చేరుకొని గాయపడిన వారిని నర్సంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా.. గుర్రం సంజయ్ మార్గమధ్యలో మృతిచెందాడు. కప్పల బన్ని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.



టెక్నోజియాన్- 24 షురూ..


టెక్నోజియాన్‌లో విద్యార్థిని సందడి

నృత్యం చేస్తున్న విద్యార్థిని


హాజరైన విద్యార్థులు


మాట్లాడుతున్న ఎన్వీ.చౌదరి


గేమ్ ఆడుతున్న విద్యార్థులు


నిట్ క్యాంపస్‌లో విద్యార్థినులు

- ప్రారంభించిన సీఎస్ఆర్ -ఐఐసీటీ సైంటిస్ట్ ఎన్వీ.చౌదరి
- సమాజానికి సాంకేతిక విజ్ఞానం తోడ్పడాలని పిలుపు
- 50కి పైగా ఈవెంట్స్
- నేడు, రేపు కొనసాగనున్న టెక్నోఫెస్ట్

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో నిర్వహించనున్న మూడు రోజుల టెక్నోజియాన్- 24 వేడుకలను సీఎస్ఆర్-ఐఐసీటీ హైదరాబాద్ సైంటిస్ట్ డాక్టర్ ఎన్వీ.చౌదరి శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక విజ్ఞానం మెరుగైన సమాజ నిర్మాణానికి నూతన ఒరవడులను సృష్టించేందుకు తోడ్పడాలని అన్నారు. నిట్ వరంగల్‌లో ఇంజనీరింగ్ విద్యలో చోటు చేసుకుంటున్న మార్పులపై విద్యార్థులు పరస్పరం విజ్ఞానాన్ని పంచుకునే వేదికగా టెక్నోజియాన్-24 నిలవాలని సూచించారు. కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఇషాన్, బి.శ్రీనివాస్, డాక్టర్ మురళీధర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టెక్నోజియాన్ పేరునే థీంగా..

నిట్ వరంగల్‌లో ప్రతి ఏడాది మూడు రోజుల పాటు నిర్వహించే టెక్నోజియాన్ సాంకేతిక మహోత్సవానికి ప్రతి ఏడాది ఏదోఒక థీమ్‌తో నిర్వహించడం ఆనవాయితీ. కాగా.. టెక్నోజియాన్-24ను టెక్నోజియాన్ పేరునే థీమ్‌గా కొనసాగిస్తున్నట్లు టెక్నోజియాన్ టీం విద్యార్థులు తెలిపారు. టెక్నో అంటే టెక్నాలజీ అని.. జియాన్ అంటే వాగ్దానం చేసిన భూమి అని దీనినే ప్రతి ఏడాది కొనసాగిస్తామని టెక్నోఫెస్ట్ ప్రారంభోత్సవం సందర్భంగా తెలిపారు. కాగా టెక్నోజియాన్-24 ప్రారంభోత్సవంలో భాగంగా విద్యార్థులు అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియం ఎదురుగా శుక్రవారం టగ్ ఆఫ్ బాల్ పేరిట నువ్వా నేనా అంటూ సరదాగా పోటీ పడ్డారు.

నేడు టెక్నోజియాన్‌లో ఇలా...

ఈ ఏడాది 50 కిపైగా ఈవెంట్స్‌తో టెక్నోజియాన్ -24 సందడి చేయనుంది. టెక్నోజియాన్-24 శనివారం రెండో రోజు మ్యాథమెటికల్ సొసైటీ ఆధ్వర్యంలో డేటా సైన్స్ క్వెస్ట్, ఫొటోగ్రఫీ క్లబ్ ఆధ్వర్యంలో రీక్రియేటింగ్ ది మూమెంట్, క్విజ్ క్లబ్ ఆధ్వర్యంలో కేబీసీ, మేనేజ్‌మెంట్ స్టడీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఫ్యూచర్ మేనేజర్, మెకానికల్ సొసైటీ ఆధ్వర్యంలో వెహికిల్ షో, ఐడియాథాన్‌లతోపాటు మ్యాథ్స్ స్కేర్ వ్యవస్థాపకుడు డాక్టర్ గజేంద్రపు రోహిత్, రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ తనూజైన్ గెస్ట్ లెక్చర్స్‌తో కొనసాగనున్నాయి.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు


డోర్నకల్: పట్టాలు తప్పిన బోగీలను పరిశీలిస్తున్న ఆర్‌పీఎఫ్ అధికారులు

- డోర్నకల్ రైల్వేజంక్షన్ పరిధిలో ఘటన


డోర్నకల్: మరమ్మతు చేస్తున్న రైల్వే సిబ్బంది

డోర్నకల్: మానుకోట జిల్లా డోర్నకల్ రైల్వే జంక్షన్ పరిధిలోని బైపాస్ రోడ్డులో శుక్రవారం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. విజయవాడ నుంచి భద్రాచలం రోడ్డు వైపు వెళ్తున్న గూడ్స్ రైలు డోర్నకల్ జంక్షన్ మెయిన్ లైన్ నుంచి బైపాస్ లైన్ మార్గంలో భద్రాచలం రోడ్ వైపు వెళ్తుండగా బైపాస్ మార్గంలో రైలు 17, 18, 19వ బోగీలు పట్టాలు తప్పాయి. బోగీలు ఖాళీగా ఉండడంతో మూడింటిలో ఒకటి పట్టాలకు అడ్డంగా నిలువగా రెండు బోగీలు పట్టాలు తప్పాయి. సమాచారం అందుకున్న స్టేషన్ సూపరింటెండెంట్ శోభన్‌ప్రసాద్‌తోపాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని పట్టాలు తప్పిన బోగీలను ట్రాక్‌పైకి తెచ్చే చర్యలు చేపట్టారు. బైపాస్ రోడ్డులో ప్రమాదం జరగడంతో విజయవాడ-వరంగల్, డోర్నకల్- భద్రాచలం మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం లేదని రైల్వే అధికారులు తెలిపారు.

ఏయార్టీ ట్రైన్ సిబ్బంది సహకారం

కాజీపేట రూరల్: డోర్నకల్ రైల్వే స్టేషన్ బైపాస్ సైడింగ్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్లను యథాస్థితికి తీసుకొచ్చేందుకు కాజీపేట జంక్షన్ నుంచి శుక్రవారం రాత్రి యాక్సిడెంట్ రిలీఫ్‌ట్రైన్ (ఏయార్టీ) ప్రత్యేక రైలు సిబ్బంది తరలివెళ్లారు. వ్యాగన్‌లు పట్టాలు తప్పిన సమాచారాన్ని కాజీపేట రైల్వే అధికారులు ఎలక్ట్రిక్ ఎమర్జెన్సీ సైరన్ మోతలతో కాజీపేటలోని ఎమర్జెన్సీ బ్రేక్ డౌన్ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

రేపు ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చెస్ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-13 చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి కన్నా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 01, 2011, ఆ తర్వాత జన్మించిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి, గెలుపొందిన నలుగురు బాలురు, నలుగురు బాలికలను డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పుట్టినరోజు సర్టిఫికెట్, చెస్‌బోర్డుతో శనివారం సాయంత్రం 7గంటల వరకు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోననంబర్ 90595 22986 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

మరమ్మతులు మరింత సులభం!

- రన్నింగ్, వ్యాగన్ల రిపేర్ కోసం షెడ్ నిర్మాణం
- నిర్వహణ కోసం ట్రాక్‌ల ఏర్పాటు


నిర్మాణంలో ఉన్న గూడ్స్ సిక్‌లైన్ షెడ్డు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ పరిధి బోడగుట్ట సమీపంలో బ్రేక్‌డౌన్ కార్యాలయం వెనకాల రైల్వే అధికారులు కొత్తగా రైల్వే గూడ్స్ సిక్‌లైన్ షెడ్డును నిర్మిస్తున్నారు. కాజీపేట జంక్షన్ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే గూడ్స్ రైళ్లకు మరమ్మతులు, మెయింటనెన్స్ కోసం ఈ గూడ్స్‌షెడ్డును నిర్మిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గూడ్స్ షెడ్డుతో పాటు గూడ్స్ రైళ్ల నిర్వాహణ కోసం కొత్తగా నాలుగు ట్రాక్‌లను కూడా నిర్మిస్తున్నారు. కాజీపేట, వరంగల్ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే గూడ్స్ ట్రైన్లు రన్నింగ్‌లో ఏమైనా మరమ్మతుకు వచ్చినా, మెకానిక్ సమస్య ఉన్నా.. వాటిని గుర్తించి కాజీపేటలో నిర్మించనున్న గూడ్స్‌షెడ్‌కు తరలించి ఆ వ్యాగన్లను తనిఖీ చేసి మరమ్మతు చేసి యథావిధిగా పంపిస్తారు. ఈ షెడ్డు నిర్మాణంతో గూడ్స్ రైళ్లు కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగా వెళ్లకుండా యార్డు మీదుగా ఆయా ప్రాంతాలకు పంపించేందుకు అన్ని విధాలా ప్లాన్ చేస్తున్నారు. దీంతో ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల ట్రాఫిక్, గూడ్స్ వ్యాగన్ల ట్రాఫిక్ సమస్య భవిష్యత్‌లో కాజీపేట జంక్షన్‌లో ఉండదని ఏయే రైళ్లకు కేటాయించిన ట్రాక్ రూట్లలో ఆయా రైళ్లు ప్రయాణిస్తాయి. ప్రస్తుతం నాలుగు సిక్‌లైన్లు, నాలుగు మార్షలింగ్ లైన్లు, తొమ్మిది గూడ్స్ లైన్లు ఉన్నాయని, గూడ్స్ రైళ్ల కోసం మరికొన్ని లైన్లు నిర్మించే అవకాశం ఉంది. అన్ని లైన్ల నిర్మాణంతో కాజీపేట రైల్వే యార్డు బిజీ సెంటర్‌గా మారనుంది. త్వరలో గూడ్స్ సిక్‌లైన్ షెడ్డును ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అవమాన భారంతో వ్యక్తి ఆత్మహత్య


శ్రీశైలం మృతదేహం వద్ద పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై రమేశ్‌బాబు

నెల్లికుదురు: అవమాన భారంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మానుకోట జిల్లా నెల్లికుదురు మండలంలోని మునిగలవీడులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మునిగలవీడుకు చెందిన దేశబోయిన శ్రీశైలం (42).. అదే గ్రామానికి చెందిన నాగబోయిన బాలరాజు భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతో ఈనెల 7న (గురువారం) బాలరాజు అతని కుటుంబ సభ్యులు.. శ్రీశైలం ఇంటికి వచ్చి గొడవ చేశారు. శ్రీశైలంపై చెప్పులతో దాడి చేసి నువ్వు చనిపోవాలని లేకుంటే మేమే చంపుతామంటూ బెదిరించారు. దీంతో బాలరాజు అతని కుటుంబ సభ్యుల దాడిని అవమానభారంగా భావించిన శ్రీశైలం అదేరోజు రాత్రి పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య దేశబోయిన సునీత ఫిర్యాదు మేరకు బాలరాజుతోపాటు అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

మనస్తాపంతో ఇంటర్ విద్యార్థి..

- జన్మదినం ముందురోజే అఘాయిత్యం


సాయికిరణ్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: తాను చదువుతున్న కళాశాల నుంచి మార్చమని కోరగా తల్లిదండ్రులు వద్దని చెప్పడంతో మనస్తాపానికి గురైన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఛాగల్లుకు చెందిన వేణుగోపాల్, సుకన్య కుమారుడైన సాయికిరణ్ హనుమకొండలోని స్కై జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో దీపావళి పండుగ సెలవులకు ఇటీవల ఛాగల్లుకు వచ్చాడు. ప్రస్తుతం చదువుతున్న కళాశాల నుంచి మార్చి మరో కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరాడు. నాలుగు నెలల్లో ఇంటర్ ముగుస్తుందని, మరో కళాశాల ఎందుకని తల్లిదండ్రులు కుమారుడికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీంతో మనస్తాపం చెందిన సాయికిరణ్ శుక్రవారం సాయంత్రం ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి తండ్రి వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణు తెలిపారు. కాగా, నేడు సాయికిరణ్ పుట్టినరోజు ఉండగా ముందురోజున ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. పుట్టినరోజు సందర్భంగా పాలకుర్తి మండలం వల్మిడి రామాలయానికి వెళ్లాలని నిర్ణయించుకున్న కుటుంబ సభ్యులు ఆ విషయాన్ని తలచుకుని రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఇదిలా ఉండగా.. సాయికిరణ్ మృతికి కేవలం కళాశాల మార్పు విషయం మాత్రమే కాకుండా మరేమైనా కారణాలు ఉండొచ్చని స్థానికంగా చర్చించుకోవడం గమనార్హం.

సెమిస్టర్ పరీక్షల ఫలితాల విడుదల

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల 2023-24 విద్యాసంవత్సరం పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. ఎంఏ ఇంగ్లిష్, తెలుగు, ఎమ్మెస్సీ బాటనీ, మైక్రోబయాలజీ, జువాలజీలో కలిపి మొత్తంగా 150మంది పరీక్షలకు హాజరుకాగా 121మంది (80.66శాతం) మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సుహాసిని, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, డాక్టర్ రాజిరెడ్డి, డాక్టర్ సురేశ్‌బాబు, అరుణ ఉన్నారు.

ఇక తెలుగులోనే..

- విద్యుత్ సమాచారంపై టీజీఎన్పీడీసీఎల్ నిర్ణయం
- రైతులకు సులభంగా అర్థమయ్యేందుకు చర్యలు


టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం


స్టేషన్‌ఘనపూర్ మండలం తాటికొండలో తక్కువ ఎత్తు కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ గద్దె వద్ద విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పశువు (ఫైల్)

హన్మకొండ: విద్యుత్ వినియోగదారులు.. ప్రధానంగా రైతులకు విద్యుత్ సంబంధిత సమాచారం సులభంగా అర్థమయ్యేలా చేరవేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ నిర్ణయించింది. ఈ మేరకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్లకు యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. గ్రామీణ ప్రాంత రైతులకు ఇంగ్లిష్‌లో సమాచారం ఇస్తే విద్యుత్ అధికారుల నుంచి వచ్చిన సమాచారం వారికి అర్థమయ్యే పరిస్థితి ఉండదు. దీంతో ఇంగ్లిష్‌లో సమాచారం అందించడంపై రైతులు, రైతు సంఘాల నాయకుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. రైతులు, గ్రామీణ ప్రాంత విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం, అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకుపోవడంతో ఎట్టకేలకు తెలుగులో సమాచారం ఇవ్వాలని నిర్ణయించారు. ఎస్ఎంఎస్‌లు కూడా తెలుగులోనే పంపాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరుకు దరఖాస్తు చేసుకున్న రైతులకు ఎస్టిమేట్, నక్ష తదితర సమాచారాన్ని ఇంగ్లిష్‌లో పంపేవారు. దీంతో ఏం అర్థం కాక రైతులు తలపట్టుకునేవారు. ఇంగ్లిష్ భాష తెలిసిన వారిని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేది. ఈ ఇబ్బందులను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో ఇప్పటి నుంచి ఎస్టిమేషన్, నక్ష, మెటీరియల్ ఇతర సమాచారం అంతా తెలుగులోనే ఇవ్వాలని, ఎస్ఎంఎస్ కూడా తెలుగులోనే పంపాలని యాజమాన్యం సూచించింది. ఇలా ఇవ్వడం ద్వారా మెటీరియల్ వివరాలపై రైతులకు పూర్తి స్పష్టత ఉంటుంది. అదే విధంగా ఇప్పటి నుంచి విద్యుత్ కనెక్షన్‌కు అవసరమైన మెటీరియల్‌ను రైతులు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. ఆ మెటీరియల్, పనులన్నీ సంబంధిత కాంట్రాక్టర్ సమకూర్చుకుని పనులు పూర్తి చేస్తారు. ఇటీవల వ్యవసాయ క్షేత్రాల్లో పశువులు విద్యుత్ ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. దీంతో విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు యాజమాన్యం జీరో విద్యుత్ ప్రమాదాల కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్రమంలో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచాలని నిర్ణయం తీసుకుంది. ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న అన్నింటిని సరి చేయనున్నారు.

రైతులకు అర్థమయ్యేలా..



రైతులకు సులభంగా అర్థమయ్యేలా ఇక నుంచి వివరాలన్ని తెలుగులో అందిస్తాం. రైతులకు మరింత నాణ్యమైన సేవలు అందించే దిశగా యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. రైతులకు ఇబ్బందులుంటే టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలి.

- వెంకటరమణ, ఎస్ఈ, హనుమకొండ

ప్రమాదాల నివారణకు చర్యలు



ప్రమాదాల నివారణకు ఎన్పీడీసీఎల్ యాజమాన్యం చర్యలు తీసుకుంది. ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రమాదాలు జరిగే అవకాశాలున్న ప్రాంతాలు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలు గుర్తించి, వాటిని సరిచేస్తాం.

- మధుసూదన్ రావు, ఎస్ఈ వరంగల్

48కిలోల గంజాయి స్వాధీనం

- రైల్వే పోలీసుల అదుపులో ఇద్దరు మహిళలు
- వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఘటన


వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ సురేందర్

కాశిబుగ్గ: వరంగల్ రైల్వే స్టేషన్‌లో గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళలను పట్టుకుని వారి నుంచి 48 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ సీఐ సురేందర్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన బాబిత కుమారి పాణిగ్రహి గుజరాత్ సూరత్‌లో ఉంటోంది. ఒడిస్సా రాష్ట్రం గంజాం జిల్లా దంగపదర్‌కు చెందిన సంజుక్త బెహరా లు గంజాయిని సూరత్‌కు తరలిస్తే డబ్బులు వస్తాయన్న ఆశతో ఇచ్ఛాపురం నుంచి అక్రమంగా సూరత్ తరలించేందుకు గుర్తు తెలియని వ్యక్తుల వద్ద ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా గురువారం రెండు ప్లాస్టిక్ సంచులు, రెండు ప్లాస్టిక్ బుట్టలలో గంజాయి ప్యాకెట్లు పెట్టుకుని నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో సూరత్‌కు బయలు దేరారు. ఈక్రమంలో పోలీసులు రైలులో తనిఖీలు చేస్తుండగా వీరు వరంగల్ రైల్వే స్టేషన్‌లో దిగారు. రాత్రి అక్కడే ఉండి శుక్రవారం మధ్యాహ్నం మరో రైలులో సూరత్ వెళ్లేందుకు వరంగల్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై ఎదురుచూస్తున్నారు. అదేసమయంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల సమయంలో వీరు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి వద్దనున్న సంచులు, బుట్టలు పరిశీలించారు. దీంతో గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించడంతో ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్ల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి ఇద్దరి మహిళలను రిమాండ్ తరలించామని తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.12,00,600 ఉంటుందని తెలిపారు. తనిఖీల్లో ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ సారయ్య, గురువయ్య, రాజు, జీఆర్పీ ఎస్సై మోయినుద్దీన్, హెడ్ కానిస్టేబుల్ రాజు, నాగరాజు, ప్రశాంతి, సుమలత పాల్గొన్నారని సీఐ తెలిపారు.


కేయూకు నేడు వర్కింగ్ డే

- పరిపాలనాధికారులు, నాన్‌టీచింగ్ సిబ్బందికి మాత్రమే..
- అధ్యాపకులకు సెలవు యథాతథం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి రెండో నేడు(శనివారం)వర్కింగ్ డేగా ప్రకటిస్తూ కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. సద్దుల బతుకమ్మ పండుగ నేపథ్యంలో అక్టోబర్ 10న యూనివర్సిటీకి సెలవు ప్రకటించిన విషయం విదితమే. ఆ రోజు సెలవుకు బదులుగా నేడు వర్కింగ్ డే గా ప్రకటించినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఈ వర్కింగ్‌డే కేవలం పరిపాలనాధికారులకు, నాన్ టీచింగ్ సిబ్బందికి మాత్రమేనన్నారు. అధ్యాపకులకు సెలవు దినంగానే పరిగణిస్తామన్నారు. ఎందుకంటే అక్టోబర్ 10 అధ్యాపకులకు యూనివర్సిటీ అలుమనాక్ ప్రకారం సెలవు రోజే కాబట్టి వారికి నేడు వర్కింగ్ డే కాదని స్పష్టం చేశారు. పరిపాలనాధికారులు, నాన్ టీచింగ్ సిబ్బంది 9న యథావిధిగా విధులకు హాజరుకావాలని రిజిస్ట్రార్ సూచించారు.

మలేషియా గడ్డపై పేరిణి నృత్యప్రదర్శన

- జనగామకు చెందిన పెరుమాండ్ల సంతోశ్‌కు ఆహ్వానం


మలేషియా చేరుకున్న పేరిణి నృత్యబృందం

జనగామ: తెలంగాణ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మలేషియాలో నేడు(శనివారం) జరుగనున్న పేరిణి నృత్య ప్రదర్శనకు జనగామ కళాకారుడికి ఆహ్వానం వచ్చింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో జనగామ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసిన జనగామకు చెందిన పేరిణి నృత్య కళాకారుడు, మాస్టర్ పెరుమాండ్ల సంతోశ్ అంతర్జాతీయ వేదికపై తన సత్తా చాటుకోనున్నారు. మలేషియాలోని మాట్రేడ్ ఎగ్జిబిషన్ సెంటర్(ఎంఈసీసీ)లో నేడు ఈకార్యక్రమం జరుగనుంది. తెలంగాణ నుంచి పేరిణి నత్యం ప్రదర్శించేందుకు మాస్టర్ సంతోశ్‌కు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత, పేరిణి రాజ్ కుమార్ నుంచి ఆహ్వానం అందింది. దీంతో పేరిణి నృత్యానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చే అవకాశం లభించినట్టైంది. జనగామ పట్టణంలో శ్రీచంద్ర కళానిలయం స్థాపించి, వందలాది మంది పిల్లలకు పేరిణి నృత్యాన్ని నేర్పిస్తున్నారు సంతోష్. ఇతని వద్ద శిక్షణ పొందిన కళాకారులు తెలంగాణ, ఆంధ్రతోపాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇస్తూ మెప్పు పొందుతున్నారు.

అద్భుత అవకాశం



అంతర్జాతీయ వేదికపై పేరిణి నృత్యం చేసేందుకు అవకాశం లభించడం సంతోషంగా ఉంది. పేరిణికీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషిచేస్తా. ఈ అవకాశం అందుకు దోహదపడుతుందని భావిస్తున్నా..

- పెరుమాండ్ల సంతోశ్, శ్రీ చంద్ర కళానిలయం, పేరిణి మాస్టర్

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

■ WGL, కరీమాబాద్, బొమ్మలగుడి దగ్గర మెయిన్ రోడ్ గ్రౌండ్ ఫ్లోర్ డీలక్స్ రూమ్స్ 2 BHK కిరాయికి ఇవ్వబడును. గోశాల ప్రక్కన. సంప్ర: 9848696291 [W-1264011]

PLOT FOR SALE

■ బచ్చన్నపేట దగ్గర 121 గజాలు + 4 మామిడి, 6 శ్రీ గంధం మొక్కలు, 5 లక్షలు మాత్రమే. Land కొన్నవారికి 32" SMART TV (REDMI) లేదా OPPO A3 Pro (8/256) *FREE* Ph: 6302280020 [SCA24000578]

SERVICES

LOSS OF DOCUMENTS

■ I, KETIRI VENUMADHAVA REDDY, S/o. Ram Reddy, R/o. H.No.35-6-725/509, Vidyaranyapuri, Hanumakonda City and District, Telangana State 506009, have lost Original Patta Pass Book (PPB) No:T21100060136, Khata No: 263, while traveling from my home to Velair Mandal. If anyone is found, please inform me at the above address and Cont: 7386605646. [W-1264053]

WANTED

■ వరంగల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ కావలెను. స్థలం: వరంగల్. సెల్: 9704013331 [W-1239940]

■ వరంగల్, హన్మకొండ, కాజీపేట్‌లో DRA రికవరీ ఏజెంట్స్ కావలెను. Ph: 7382610097 [HA-05883]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ18k Ph: 9160900024, 9640400073 [SCA-24000547]

WANTED TEACHERS

■ Wanted Supporting Lady teacher for Primary (1 to 5) Classes. Part time and Full time. Indian Kids High School, Ramannapet, Wgl: Cell: 9963006221. [W-1264012]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.